క్లుప్తంగా

ముత్యాలమ్మ గుడి చైర్మన్‌గా రాధారపు భిక్షపతి

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీ ముత్యాలమ్మ గుడి నూతన చైర్మన్‌గా నార్కట్‌పల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రాధారపు భిక్షపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ఇడుకుల్ల భిక్షమయ్య, ప్రజ్ఞాపురం రాములు, కమ్మంపాటి రాములు, మంద గిరిప్రసాద్, నడింపల్లి శ్రీహరి, గౌరవ సలహాదారులుగా బొక్క భూపాల్‌రెడ్డి, యాద వెంకన్నను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సన్మానించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సామ కొండల్‌రెడ్డి, లింగాల రాములు, జేరిపోతుల భరత్, మిర్యాల రాములు, జనిగ భిక్షం పాల్గొన్నారు.

మంత్రికి పుస్తకం బహూకరణ



పుస్తకాన్ని అందజేస్తున్న అంజయ్య

రామగిరి(నల్లగొండ): ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ప్రముఖ సినీ నటుడు దర్శక నిర్మాత డాక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డి సినీ జీవితంపై నల్లగొండ ఫిలిం సొసైటీ సెక్రటరీ పున్నమి అంజయ్య రచించిన పుస్తకాన్ని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బహూకరించారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ప్రభాకర్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, ఆయన పేరున జాతీయ అవార్డు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. నల్లగొండలో ఏర్పాటు చేసే కళాభారతికి ప్రభాకర్ రెడ్డి పేరు పెట్టాలని విన్నవించారు.

కట్టంగూర్ తహసీల్దార్‌గా యాదగిరి



కట్టంగూర్ : కట్టంగూర్ మండల తహసీల్దార్ (పూర్తి అదనపు బాధ్యతలు) గా నకిరేకల్ తహసీల్దార్ పి.యాదగిరి నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

తిప్పర్తి తహసీల్దార్‌గా రామకృష్ణ



తిప్పర్తి : తిప్పర్తి మండల నూతన తహసీల్దార్‌గా ఆర్.రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ పరుశురాం బదిలీపై నల్లగొండకు వెళ్లారు. ఆయన స్థానంలో రామకృష్ణ తిప్పర్తికి వచ్చారు.

ఎంఈఓకు వినతి

నాంపల్లి: మండలంలోని పులిపలుపుల పాఠశాలకు కేటాయించిన నరసింహులగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని వెనక్కి పంపించాలని యూఎస్‌పీఎస్ జిల్లా నాయకుడు రత్నయ్య నరసింహ సోమవారం ఎంఈఓ మల్లేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట యూనియన్ నాయకులు ఉన్నారు.

యానాల మల్లారెడ్డికి నివాళి

నకిరేకల్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, రైతు కూలి సంఘం వ్యవస్థాపకుడు కామ్రేడ్ యానాల మల్లారెడ్డి ఉద్యమ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ జిల్లా నాయకుడు అంబటి చిరంజీవి కోరారు. నకిరేకల్‌లో సీపీఐఎంఎల్ న్యూడెమాక్రసీ ఆధ్వర్యంలో సోమవారం యానాల మల్లారెడ్డి 23 వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి స్మారక స్తూపం వద్ద చిరంజీవి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పజ్జూరు ఉపేంద్ర, గజ్జి రవి, అనంత రెడ్డి, అంబటి నర్సయ్య, అంబటి నవీన్, వెంకన్న ,లింగయ్య, మట్టయ్య, పాల్గొన్నారు.

శివాలయానికి విరాళం



విరాళం అందిస్తున్న శివ భక్త మండలి ప్రతినిధులు

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నకిరేకల్ శివ భక్త మండలి ఆధ్వర్యంలో సోమవారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పల రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో శివ భక్త మండలి అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్, కార్యదర్శి కట్టగూరి వెంకన్న, కోశాధికారి ముత్యాల భిక్షం, సభ్యులు రామకృష్ణ, సిరికొంట భిక్షం, పి.వెంకన్న, జి.సైదులు, సోమయ్య, చంద్రయ్య, పల్స శ్రీను, ఆలయ ధర్మకర్తలు కొండ వెంకన్న, చెన్నబోయిన చంద్రశేఖర్, బొప్పని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కార్యాలయంగా మార్చొద్దు

నల్లగొండ టౌన్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని మంత్రి క్యాంపు కార్యాలయంగా మార్చడాన్ని తాము ఖండిస్తున్నట్లు సీపీఐఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే నూతన భవనాన్ని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌గా కొనసాగించాలని కోరారు.

నత్తనడకన నీటి ట్యాంకుల నిర్మాణం



నకిరేకల్‌లో నిర్మాణంలో ఉన్న నీటి ట్యాంక్



నిరుపయోగంగా ఉన్న పైపులు

- అమృత్–2.0 లో రూ.25 కోట్లు మంజూరు
- నిధుల విడుదలలో జాప్యం
- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న నకిరేకల్ ప్రజలు
- వారంలో మూడుసార్లు మాత్రమే పట్టణంలో నీటి సరఫరా

నకిరేకల్ : ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోఅమృత్ పథకం కింద చేపట్టిన ఓవర్‌హెడ్‌నీటి ట్యాంకుల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధుల విడుదలలో జాప్యంతో పనులు వేగంగా సాగడం లేదు. ఇప్పటికే నకిరేకల్ పట్టణం రోజురోజుకూ విస్తరిస్తూ జనాభా 40 వేలకుపైగా చేరుకుంది. మొత్తం 20 వార్డులు ఉన్నాయి. చుట్టుపక్కల మండలాల్లోని ప్రజలు నకిరేకల్‌లో స్థిర నివాసం ఏర్పరచుకోవడంతో నకిరేకల్‌లో జనాభా పెరుగుతోంది. మేజర్ పంచాయతీగా ఉన్న నకిరేకల్ 2021లో మున్సిపాలిటీగా మారిన విషయం విదితమే. మున్సిపాలిటీలో మొత్తం 9,150 నివాస గృహాలు ఉన్నాయి. ప్రస్తుతం 16 ఓవర్ హెడ్ నీటి ట్యాంకులు ఉన్నాయి. వీటితోపాటు మరో 56 మినీ ట్యాంకులు, 310 పబ్లిక్ నల్లాలు ఉన్నాయి. 8560 నివాస గృహాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు. ప్రస్తుతం పట్టణం మొత్తానికి 5 లక్షల లీటర్ల తాగునీరు అవసరం ఉండగా 2.50 లక్షల లీటర్ల నీటిని మాత్రమే అందిస్తున్నారు. మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో మిషన్ భగీరథ కింద 1500 నల్లా కనెక్షన్లు ఇచ్చారు.

దాదాపు 36 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ పైప్‌లైన్..

అమృత్–2.0 పథకం కింద నకిరేకల్ పట్టణంలో రూ.25 కోట్ల వ్యయంతో వ్యవసాయ మార్కెట్, నిమ్మ మార్కెట్, నారాయణరెడ్డి ఫంక్షన్ హాల్ వీధిలో ఒక్కొక్కటి చొప్పున 7 లక్షల లీటర్ల సామర్థ్యంతో మొత్తం మూడు భారీ నీటి ట్యాంకుల పనులను గత ఏడాది ప్రారంభంలో మొదలు పెట్టారు. నీటి ట్యాంకుల నిర్మాణ పనులు ఇంకా పిల్లర్ల దశలోనే ఉన్నాయి. నల్లగొండ మండలం పానగల్ మంచి నీటి సంప్ నుంచి ప్రత్యేక గొట్టపు మార్గం ద్వారా ఈ మూడు ట్యాంకులకు లైన్ వేయనున్నారు. ఆ తరువాత నకిరేకల్ పట్టణంలోని అన్ని కాలనీల్లో సరఫరా చేసేందుకు దాదాపు 36 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ నిర్మించనున్నారు. ఈ పనులు 2026 మార్చి మాసంలో పూర్తి చేయాలని గడువు విధించినా పనులు మాత్రం వేగంగా సాగడం లేదు.

పూర్తిస్థాయిలో అందని నీరు

నకిరేకల్ పట్టణంలోని అన్ని ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. మిషన్ భగీరథ పనులు చేపట్టినప్పటికీ 20 శాతం మేరకే పట్టణంలోని గృహాలకు తాగునీరు అందుతోంది. మున్సిపాలిటీ పరిధిలోని బాబాసాహెబ్‌గూడెంతోపాటు పట్టణంలోని కొన్ని కాలనీల్లో ఇళ్లకు నల్లా కనెక్షన్ ఇచ్చి వదిలేశారు. ఇంకా 80 శాతం మందికి పైగా ప్రజలు తాగునీటికోసం పబ్లిక్ నల్లాలే దిక్కయ్యాయి. 20 వార్డుల్లోని ఆయా వీధుల్లో ఏర్పాటు చేసిన పబ్లిక్ నల్లాలకు వారానికి మూడుసార్లకు మించి నీటిని వదలడం లేదు. వారంలో మూడుసార్లు వచ్చే నీటిని ప్రజలు క్యాన్లల్లో బిందెల్లో పట్టుకుని నిల్వ చేసుకుని వినియోగించుకుంటున్నారు. మరి కొంతమంది ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి నీటి ట్యాంకుల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి ప్రతిరోజూ శుద్ధ జలాలు అందించాలని నకిరేకల్ పట్టణ ప్రజలు కోరుతున్నారు.

క్యాన్లు, బిందెల్లో నీటిని తెచ్చుకుంటున్నాం



మేము పదేళ్ల నుంచి మున్సిపాలిటీ వారు అందించే సాగర్ నీటిని మాత్రమే తాగుతున్నాం. మా కాలనీలో ఏర్పాటు చేసిన పబ్లిక్ నల్లాకు వారానికి రెండుసార్లు మించి నీటిని వదలడం లేదు. నల్లా నీరు వచ్చినప్పుడు క్యాన్లు, బిందెలతో తెచ్చుకుంటున్నాం.

–కనుకుంట్ల ఆగమ్మ, సుందరయ్యనగర్

నిధుల విడుదల ఆలస్యం అవుతోంది



అమృత్ పథకంలో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి నిధుల విడుదల ఆలస్యం అవుతోంది. సంబంధిత కాంట్రాక్టర్‌కు పనుల్లో వేగం పెంచాలని మూడు నోటీసులు కూడా ఇచ్చాం. మరో వారంలో పనుల్లో వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– గౌతం, మున్సిపల్ ఏఈ, నకిరేకల్

ఇంటింటికీ కృష్ణా జలాలు సరఫరా చేయాలి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు : నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి కృష్ణా జలాలు సరఫరా చేయాలని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చౌటుప్పల్ పట్టణ ప్రజల లెక్క తక్కువ చూపించి నీరు తక్కువగా సరఫరా చేయడంతో వారికి సరిపడా నీరు అందడం లేదన్నారు. అదేవిధంగా నారాయణపురం మండల ప్రజలకు అంతంత మాత్రంగానే నీటి సరఫరా జరుగుతోందన్నారు. నీటి సమస్య తీర్చేందుకు లింగోటం 70 ఎంఎల్డి నీటిని మునుగోడు నియోజకవర్గంలో సరఫరా చేయాలని సూచించారు. అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు, గ్రామాల బోరు నీటిని ఒకే ట్యాంక్ ద్వారా సరఫరా చేయడంతో నీరు కలుషితం అవుతోందన్నారు. రెండింటిని వేర్వేరుగా సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈలు కరుణాకర్, లక్ష్మీనారాయణ, శాంతికుమారి, డీఈలు దీన్‌దయాల్, సంపత్, మునుగోడు తహసీల్దార్ నరేష్, ఐబీ డీఈ ప్రేమ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువు పరిశీలన

మార్నింగ్ వాక్‌లో భాగంగా దాదాపు 400 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మునుగోడు పెద్ద చెరువు భూమిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునుగోడు చెరువులో 365 రోజులు నీరు నిల్వ ఉండేలా సాగర్ జలాలతో నింపేందుకు అవసరమైన కాల్వలు తవ్విస్తానన్నారు. అనంతరం మునుగోడులోని పలు స్వీట్ దుకాణాలు, హోటళ్లను ఆయన తనిఖీ చేశారు. ఆయా దుకాణాల యజమాలు వినియోగిస్తున్న పిండి పదార్థాలు, నూనెలను పరిశీలించారు. తినుబండారాల తయారీలో దుకాణాల యజమానులు కల్తీ నూనె వినియోగించవద్దని సూచించారు.

నెరవేరుతున్న పేదల సొంతింటి కల



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఎమ్మెల్యే వీరేశం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ఇందిరమ్మ ప్రజా పాలనలో పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతుండడంతో ప్రజలు సంతోషంలో ఉన్నారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలం గోరెంకలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు ఇళ్లు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ దాసరి వీరార్జున్‌రెడ్డి, నాయకులు చెట్టిపల్లి భాస్కర్, నకిరేకంటి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడు !

- రెండేళ్ల క్రితం రూ.4 కోట్ల 4 లక్షలు మంజూరు
- గుంత తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్
- వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్న సోలిపురం గ్రామ ప్రజలు



వంతెన నిర్మాణం కోసం రెండు నెలల క్రితం తవ్విన గుంత

మునుగోడు: సోలిపురం గ్రామ శివారులో వంతెన నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. నిధులు మంజూరైనా పనులు పూర్తిచేయడంలో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండు నెలల క్రితం పనులు ప్రారంభించారు. పిల్లర్ల నిర్మాణం కోసం కేవలం గుంతను మాత్రమే తవ్వి వదిలేశాడు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

నిలిచిపోతున్న రాకపోకలు

సోలిపురం గ్రామం నుంచి మునుగోడు మండల కేంద్రానికి రాకపోకలు జరిపే రోడ్డులో గాంధీసాగర్ ప్రాజెక్టులోకి నీరు పారే వాగు ఉండడంతో వర్షాకాలం వచ్చినప్పుడు ఆ రోడ్డు వెంట రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. దీంతో వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఆ గ్రామ ప్రజలు దాదాపు 30 ఏళ్లుగా పోరాడుతున్నారు. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం రెండేళ్ల క్రితం నీటి పారుదల శాఖ నిధులు రూ.4 కోట్ల 4 లక్షలు మంజూరు చేసింది. అయితే ఆ పనులు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు టెండర్లు పిలవకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఏడాది క్రితం అధికారులపై వత్తిడి తీసుకొచ్చి టెండర్లు పిలిపించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో ఎమ్మెల్యే వత్తిడితో రెండు నెలల క్రితం పిల్లర్ల నిర్మాణం కోసం గుంతలు తవ్వించాడు. కంకర, ఇసుక డంప్ చేసి పెట్టుకున్నాడు. కానీ పనులు మాత్రం నేటికీ మొదలు పెట్టలేదు. దీంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరైనా పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని పనులు వేగంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన



మర్రిగూడ : చిన్నారికి అన్నప్రాసన చేయిస్తున్న సూపర్‌వైజర్లు యశోద, శ్రీలత

నకిరేకల్ : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నకిరేకల్ పట్టణంలోని మూసీరోడ్డులో ఉన్న 2, 3 అంగన్‌వాడీ కేంద్రాలు, నోముల అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అశ్రాఅంజుమ్ పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భవాని, సునిత, అంగన్‌వాడీ సిబ్బంది ధనమ్మ, లలిత, కైరునిసాబేగం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

చిట్యాల: మండలంలోని సుంకెనపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం అహల్య, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.భాగ్యమ్మ, ఎం.రజిత, వైసంధ్య, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

నార్కట్‌పల్లి: మండలంలోని దాసరిగూడెం గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్ సరిత, అంజలి, పంచాయతీ కార్యదర్శి గీతాంజలి, అంగన్‌వాడీ టీచర్లు సునీత, కామినేని హాస్పిటల్ డెంటల్ స్టూడెంట్స్ గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మర్రిగూడ : తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ముమ్మడి యశోద, శ్రీలత అన్నారు. సోమవారం మర్రిగూడ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలతో శిశువుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు అందించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అరుణ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

రామగిరి(నల్లగొండ): ప్రజలంతా చేయిచేయి కలిపి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్– 2 ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ఎన్జీ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో డీ గ్రేడబుల్ చేతి సంచుల విక్రయశాలను ప్రిన్సిపాల్ ప్రారంభించి మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పారంగి రవికుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వైవీఆర్ ప్రసన్నకుమార్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ప్రోగ్రాం అధికారి ఎం.వెంకట్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సేంద్రియ కూరగాయల సాగుపై అవగాహన

నకిరేకల్ : రసాయనాలు లేని కూరగాయలు, పండ్ల మొక్కలు ఎలా సాగు చేయాలో నకిరేకల్ మండలం పాలెం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో సేంద్రియ ఎరువులతో కూరగాయలు, పండ్ల మొక్కలను నాటారు. హెచ్‌ఎం వంటల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తాటిపాముల నర్సింహమూర్తి, లింగాల నగేష్, కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్లబ్ సెలక్షన్ ట్రయల్స్‌కు వెంకటసాయి



వెంకటసాయిని అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నల్లగొండ టూటౌన్ : ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్ సెలక్షన్ ట్రయల్స్‌కు నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ క్రీడాకారుడు రాచూరి వెంకటసాయి ఎంపికైనట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు తెలిపారు. కోల్‌కతాలో ఈ నెల 25 వరకు ఫుట్‌బాల్ క్రీడాకారుల టాలెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. ట్రయల్స్‌లో పాల్గొనడానికి దక్షిణ భారత దేశం నుంచి వెంకటసాయి ఒక్కరే ఎంపికైనట్లు తెలిపారు. సోమవారం వెంకటసాయిని ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

నల్లగొండ: పట్టణంలోని 3, 19 వార్డుల పరిధిలో గల ఎన్జీవో కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతూ ఆయా వార్డుల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు గాలి నాగరాజు, గోగుల గణేశ్ సోమవారం మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విన్నవించారు.

మహిళా ఉద్యోగుల భద్రతకే ఇంటర్నల్ కమిటీలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రత్యేక అధికారి

కనగల్: పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగుల భద్రతకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇంటర్నల్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఐసీడీఎస్ జిల్లా ప్రత్యేక అధికారి రేబాక అన్నారు. సోమవారం కనగల్ తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పీహెచ్‌సీలో ఇంటర్నల్ కమిటీల ఏర్పాటుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారని తెలిపారు. మహిళలపై లైంగిక వేధింపులు, దాడుల నిరోధానికి ఈ కమిటీలు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి పద్మ, ఎంపీడీఓ కే సుమలత, డాక్టర్ గాదరి రామకృష్ణ, పార్వతమ్మ, విఘ్నేశ్వర్‌రెడ్డి, డి.సునీత, యాదగిరి, మంజుల పాల్గొన్నారు.

సాహిత్యంతోనే మెరుగైన సమాజం

చిట్యాల: సాహిత్యం, కళలతోనే మెరుగైన సమాజం రూపుదిద్దుకుంటుందని ప్రముఖ గేయ రచయిత, గాయకుడు గడ్డం శ్రీను అన్నారు. వట్టిమర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో 'పాట, రచన, గానంపై మెళకువలు' అనే అంశంపై విద్యార్థులకు సోమవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రచించిన 'ననుగన్న నాపల్లె తల్లిరా' పాటతోపాటు పలు ఇతర పాటలను పాడి వినిపించారు. తెలంగాణ సాహితి జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, ఉనికి సామాజిక సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు బండారు శంకర్, హెచ్‌ఎం రమేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మేడి శ్రీలత, ఉపాధ్యాయులు ఆనంద్, సూర్యప్రకాష్, నీరజ, చంద్రయ్య, అనీస్ ఫాతీమా, హంస, పెంటయ్య పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం స్థానంలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించడానికి సోమవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వచ్చిన సందర్భంగా బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంగా మార్చాలని నిరసన తెలియజేడానికి బీజేపీ నాయకులు సిద్ధం అవుతుండగా అరెస్ట్ చేసి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, బండారు ప్రసాద్, పిల్లి రామరాజుయాదవ్, బొజ్జ నాగరాజు, కంకణాల నాగిరెడ్డి, గుర్రం వెంకన్న, గడ్డం మహేష్, తదితరులు ఉన్నారు.

కుంటను తలపిస్తున్న మినీ స్టేడియం

నకిరేకల్ : పట్టణంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మినీ స్టేడియం చెరువు కుంటను తలపిస్తోంది. ప్రతిఏటా వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు మినీ స్టేడియం నీటితో నిండిపోతుంది. ఈ స్టేడియం అంచునే ఇసాయి కుంట ఉండడంతో పట్టణంలోని ఎగువ నుంచి వచ్చే వరద నీరు స్టేడియంలోకి చేరుకుని పక్కనే ఉన్న కుంటలోకి వెలుతుంది. వరద నీరు రాకుండా అధికారులు శాశ్వత పరిష్కా మార్గాలను చూపాల్సి ఉంది. స్టేడియం ఆవరణ వర్షపు నీటితో నిండిపోవడంతో చిన్నారులు సైకిళ్లు తొక్కుతూ నీటిలో ఆటలు ఆడుతూ సందడి చేశారు. సోమవారం సాయంత్రం నకిరేకల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ రంజిత్‌కుమార్, మున్సిపల్ ఏఈ గౌతం కుమార్‌లు మినీ స్టేడియాన్ని పరిశీలించారు. జేసీబీని తెప్పించి నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు.



మినీ స్టేడియంలో నిలిచిన వర్షపు నీటిలో సైకిల్ తొక్కుతున్న చిన్నారులు

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి



నకిరేకల్ : కరపత్రాలను పంచుతున్న బీజేపీ నాయకులు

నకిరేకల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ మండలం నోముల గ్రామంలో సోమవారం కేంద్ర పథకాల ప్రచార కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేసి మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు బుడిగె సైదులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యానాల శంకర్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న, యానాల శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పల నాగరాజు, దొడ్డోని శంకర్, రాచకొండ పెద్దులు, బాదిని యాదయ్య, సామ విక్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కరపత్రాల పంపిణీ

నార్కట్‌పల్లి: మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నార్కట్‌పల్లిలో సోమవారం మండల బీజేపీ అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని అత్యధిక స్థానాల్లో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బిళ్ళకంటి శ్రీకాంత్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, పాల్వాయి భాస్కర్‌రావు, ముంత నర్సింహ నోముల నాగరాజు, వడ్డెగోని రామలింగం, పాలకూరి రమేష్, నడింపల్లి పార్థసారథి, పానుగుల్ల శివ, చెరుకు శివ,బంగారి ఉపేందర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన మార్బుల్స్ టైల్స్ సంఘం గౌరవ అధ్యక్షుడు జిల్లా వెంకన్న ఇటీవల మృతి చెందాడు. కాగా నకిరేకల్ పట్టణ మార్బుల్స్ టైల్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం వెంకన్న కుటుంబీకులను పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సంఘం ప్రతినిధులు ఆకారపు శంకర్, పందిరి యాదగిరి, నిమ్మనగోటి లింగయ్య, చిట్యాల మహేష్, బొజ్జ సైదులు, వంగూరి నాగయ్య, ఇటుకల అయోధ్య, హరిబాబు, మధు, బొజ్జ చంటి జింతికల ఎల్లయ్య, నిమ్మనగోటి రవి, గంగాధరి యాదగిరి, రావుల నగేష్, బొల్లెపల్లి వెంకన్న, సత్యనారాయణ, కత్తుల రమేష్ పాల్గొన్నారు.

కంప్యూటర్ల వితరణ

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1986–87 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆ పాఠశాల హెచ్‌ఎం డి.రాములకు 5 డెస్కటాప్ కంప్యూటర్లను అందజేశారు. పూర్వ విద్యార్థులు కొడిమాల కృష్ణ, కంభంపాటి రాములు, కేమ వెంకటేష్, పెండోట వనజారాణి, ఉపాధ్యాయులు శ్యామల, ఆరోగ్యమ్మ, శేఖర్‌రెడ్డి, రామస్వామి, వెంకట్ రాజు పాల్గొన్నారు.



కంప్యూటర్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గ్రంథాలయ సమితి ఏర్పాటు

నకిరేకల్ : మండలంలోని పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం స్నేహపూర్వక బాలల గ్రంథాలయ నిర్వహణ సమితిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వంటల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ సమితి పాఠశాలలోని గ్రంథాలయ విధి నిర్వహణతోపాటు ఉపాధ్యాయులకు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు తాటిపాముల నర్సింహమూర్తి, లింగాల నగేష్, విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.